# అప్పిచ్చువాడు, వైద్యుడూను

ఆదెమ్మ ఎప్పుడూ హైదరాబాదు వెళ్లాలేదు. వెళ్లాలనీ అనుకోలేదు. ఈ మధ్యాహ్నం వరకూ. ఆమె గుండె దడగా ఉంది. కన్నీళ్లొత్తి చెంగు తడిసిపోయింది.

“నేం గూడా వస్తా. ఒద్దనమాక.”

చిన్ని అంజిరెడ్డి తలెత్తి ఓసారి భార్యవేపు చూశాడు. ఆమె మంచం దగ్గిరకొచ్చి కూచుంది. కాళ్లు ముడుచుకుని మోచేతి మీద తల ఆనించి మంచం మీద గీసిన బొమ్మలా పడుకున్నాడు రెడ్డి.

“లంజకాడి కెల్తున్నానా, షికారుగ్గాని ఎల్తన్నానా?”

రెడ్డి తిడతాడనుకుందామె. తెచ్చి పెట్టుకున్న విసుగు తప్ప అతని మాటల్లో కోపం లేదు. ఆదెమ్మకి ఏడుపు ఆగడంలేదు. అతని వేపు చూస్తూ నిశ్శబ్దంగా ఏడుస్తూకూచుందామె. రెడ్డి ఆమెవేపు చూడ్డంలేదు. కళ్లు మూసుకు పడుకున్నాడతను. హఠాత్తుగా బొల్లి రాజుగారి పని మీద ఎవరికీ చెప్పకుండా అతను హైదరాడాదు ఎందుకు వెళ్లాలో ఆమె కర్థం కాలేదు. రెడ్డి ఏదో దాస్తున్నాడనీ పైకి చెప్పకపోయినా లోపల చిందర వందరైపోతున్నాడనీ ఆదెమ్మకి తెలుస్తోంది. సన్నబడి పెరిగి పోవడానికిసిద్ధంగా ఉన్న ఆమె పసుపుతాడుకీ హైదరాబాదుకీ ఏదో సంబంధం ఉందని ఆదెమ్మ నమ్మకం.

“కూలి పన్లగ్గాని ఎల్తన్నావా!”

“లేదెహె.”

“అయితే ఈణ్నే ఉండు. ఆ ఉప్పెదవ నీకేదో నూరిపోసేడు.” అంజిరెడ్డి సమాధానంగా నిద్రపోయాడు. ఆ రోజు ఉదయం చొక్కావేసుకుంటుంటే ఉప్పురావు ఒచ్చేడు. ఓ కాలునేలమీద ఆనించి సైకిలు దిగకుండానే బెల్లు కొడుతూ అరిచేడు.

“అంజిరెడ్డీ–మాటిలారా.”

ఆమాట ఏవిటో అతనికే అతనిలాగే ఊళ్లో చిన్న రైతులందరికే తెలుసు. ఉప్పురావు అన్నాడు.

“రాజుగారోపాలి రమ్మన్నారు.”

“ఏంటి యెంటబెట్టు రమ్మన్నారా?”

"లేవనుకో, సర్లే. ఊళ్లో కెల్తన్నావుగావాల్న. పన్జూసుకుని తొందరగారా."

"ఆయ."

ఉప్పురావు వెళ్లిపోయాడు. చెప్పు లేసుకుని పొలం బయల్దేరేడు అంజిరెడ్డి. అతని కడుపు చెరుకు మంటలా మండుతోంది. రాజుగారెందుకు రమ్మంటారు? ("ఏటయ్యా రెడ్డిగారూ తొంగి చూడ్డం మానేశారు మరి.") బొల్లిరాజుగారి దగ్గిర గింజలకోసం, యూరియాకోసం అప్పుతీసుకుని మూడేళ్లయింది. ఒక్కపైస ఇవ్వలేదు. పొలాలన్నీ బీళ్లయిపోయాయి. మెట్టంతా దరిద్రం చుట్టుకుంది. చెరువు ఎప్పుడో ఎండిపోయింది. చెరువు పూడిక తీసి పదేళ్లయింది. దున్నల గుంపుల్లా మబ్బులు ఊరి మీదికి రావడం తప్ప చినుకు చినకలేదు. బొల్లిరాజుగారి తరపునే ఉన్నాయి వర్షాలు. వడ్డీలు పెరిగిపోయాయి. ఊరిదేవతకి కోళ్లు కోశారు. రామాలయంలో పూజలు చేశారు. కోళ్లు తిన్న అమ్మరాయి అయికూచుంది. ఊరంతా కాలిచల్లారినట్టుంది. గాలీధూళీ తప్ప జీవం అంతరించిపోతున్న ఏదో గ్రహంలా ఉంది. బంధువుల రాకపోకలు పెళ్లిళ్లు పేరంటాలు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. చెరువు అవతల స్మశానికి మాత్రం నిత్యనైవేద్యంలా జరుగుతోంది. కూతురి పెళ్లిచేసి ఏడాది తిరక్కుండానే తాకట్టుపెట్టినపోలం విడిపించుకోలేక సీతన్న పొలానికి వెళ్లి పురుగుమందు తాగేడు. మనిషి మాంసం రుచి మరిగిన కరువు మొసలి ఎంచుకుని మింగడం ప్రారంభించింది. జంగం మల్లికార్జునుడు, సత్తిరెడ్డీ, వడ్రంగి భద్రం పెళ్లాం- మొత్తం ఏడుగురు చినుక్కోసం చూసి లాభం లేదని పురుగు మందుతో తీర్చుకున్నారు.

అంజిరెడ్డి కాళ్లు అలవాటుగా పొలం వెళ్తున్నాయి. భుజం రాసుకునే వరకూ చూడనే లేదు. భద్రం ఆగిపోయేడు.

" పొద్దెక్కి బయల్దేరేవేటీ?"

" ఏం లేదు. నువేణ్నించి మావా?"

" పనేవుంది. ఇంటో కూచోలేక గుడికాడ నుంచొస్తన్నా. చేసుకోడానికి పనుంటే గదా? నే తాగాల్సిన మందు అది తాగిపోయింది."

" ఊరికి శనిబట్టింది. పిల్లలిద్దర్నీ సరింగా కూడుపెట్టలేక తుని పంపేశాను. ఉదయవే రాజుగారు కవురంపేరు. పురుగు మందుగాని ఇస్తారేమో అడగాలి."

" నవ్వుతాలకి కూడా అనకురా బాబు. మన మండలానికి బోరు పంపులు సేంక్ష నిచ్చా రంటగా?"

" ఊరుకోమావా. గంగేడుంది? భూమిలో నీటి సుక్కుందా? ఎదవ బోరు పంపులు

ఎవడిక్కావాలెహె? ఈ కార్తె ఎలగా ముంచింది. ఎవుళ్లుచ్చ ఆళ్లు తాగాల్సిందే. ఆ బోరు పంపులిచ్చే ఎదవని నాల్రోజులుండమనీడ."

భద్రం ఏవీ మాటాడలేదు. చెయిజాపి అగ్గి పెట్టె తీసుకుని బీడీ వెలిగించుకుని వెళ్లిపోయాడు. అంజిరెడ్డి ముందు కెళ్లేడు. కొంచెం దూరంగా నీడల్లా పొలాల మీంచి అడ్డంగా హైరోడ్డు దగ్గిర్నించి పుల్లల మోపులు నెత్తి కెత్తుకుని ముగ్గురు మనుషులు కోమటి సుబ్రమణ్యం దొడ్డివేపు పరిగెడుతున్నారు. రాత్రిళ్లు తార్రోడ్డు పక్కనున్న చెట్లకినిప్పు పెట్టి రాజుకుని అవిలోపల్నించి చచ్చేవరకూ ఓపికచేసుకుని సామాన్యంగా రాత్రిళ్లు కొమ్మలుకొట్టి ఇళ్లకి చేరేసుకుంటారు. కరువు నేర్పిన విద్యల్లో ఇదొకటి. రోడ్డు మీద చెట్లు నిరుటి పచ్చతోరణంలా ఉన్నాయి.

పదకొండు దాటింతరవాతగానీ అంజిరెడ్డి కడుపులో వెగడు తగ్గలేదు. ఈసారి కాళ్లని తనీడుచుకుంటూ రాజుగారింటవేపు బయలుదేరాడు. గుమ్మం దగ్గిరి కొస్తూండగానే ఉప్పురావు రెండు కూల్డ్రింకు సీసాలతో ఎదురయ్యేడు.

" ఒచ్చేవా? ఉండొక్కనిముషం."

ఇద్దరూ గేటు తీసుకుని లోపలి కెళ్లేరు. బయట గుమ్మం దగ్గిర ఆగిపోయాడు అంజిరెడ్డి. లోపల్నించి ఉప్పురావు గ్లాసెడు కుండలో నీళ్లు తీసుకొచ్చి ఇచ్చేడు. చల్లటి సీమవెండిగ్లాసు చేతిలో ఉంచుకుని లోటాడు ఆశ్చర్యంతో చూశాడు రెడ్డి.

"తాగవయ్యా రాజుగా రిమ్మన్నారు."

బెంచీ మీద కూచుంటూ రెడ్డిని కూడా పక్కన కూచోపెట్టు కున్నాడు ఉప్పు. మూతి తుడుచుకుని గ్లాసు కింద పెడుతూండగా చెప్పేడు.

" ఏవుందీ, నీగురించి మాటాడదావనే అయగారు రమ్మన్నారు. మరి మూడేళ్లు దాటిపోయింది గదా. ఓ మాటనేకుంటే బావుంటదనీ." తరవాత రాజుగారికి అంజిరెడ్డి నిజాయితీ పట్ల గల ప్రత్యేక గౌరవం గురించి కూడా మాట్లాడేడు. ఇంతలో పని మనిషి వచ్చిందిలోపల్నించి.

" చినపాపగారు కేకేత్తన్నారండి."

ఉప్పురావు వేగంగాలో పలికెళ్లి రెండు నిముషాల్లో తిరిగొచ్చేడు. విస్తరాకులో పులిహోర తీసుకొచ్చి అంజిరెడ్డి చేతిలో పెడుతూ అన్నాడు.

" కొద్దిగా. చినపాపగా రొచ్చేరు గదా. సర్దాగా ఆవెట్టి పులిహోర జేసేరు. ఉండు మంచినీళ్లట్టుకొస్తా."

పరిమళిస్తూ పచ్చగా వస్తరాకులో నూనెతో మెరుస్తోన్న పులిహోర చూడగానే అంజిరెడ్డి కడుపులో ఊరి ఆకలంతా వెయ్యినోళ్లతో విచ్చుకుంది. ముక్కుపుటాల్లో కమ్మటి ఆవ వాసన. మొదటి ముద్ద తీసుకుంటూండగా మూడేళ్లనించీ వడ్డీ కూడ ఇవ్వని వాడికి ఆవపెటట్టిన పులిహోర పెట్టడం ఎందుకో అపసవ్యంగా అనిపించిందతనికి. ఏడు నిముషాల తరవాత అంటుజాడలేని విస్తరాకుని జాగ్రత్తగా మడిచి గోడవతల పడేసి చెంబెడు మంచినీళ్లు తాగి త్రేన్చకుండా ఉండేందుకు ప్రయత్నించేడు చిన అంజిరెడ్డి.

"రా. లోపల రాజమండ్రీ డాట్రుగారుకూడా ఉన్నారు."

తువాల్తో మొహం తుడుచుకుని లోపలికి అడుగుపెట్టేడు అంజిరెడ్డి. రాజుగారికీ డాట్రుగారికీ దణ్ణం పెట్టి గోడ నానుకుని కూచున్నాడతను. రాజమండ్రీ డాక్టరుగారు తెల్లగా చల్లటి అరటి దూటలా ఉన్నారు.

" మన క్రిష్ణం రాజుగారంటే నీకు తెలీదనుకో, జిల్లాలో గొప్ప డాక్టుగారాయన. మనింట్లో అందరం ఎప్పుడూ వారి దగ్గిరికే వెళ్తూంటాం. ఈన చేసిన ఆపరేషన్లు చూసి హైదరాబాదు డాక్టర్లకే మతోయింది. దేవుడనుకో. ఆయన అస్తవాసి ఎటువంటిదో నీకు తెలీదు. ఉదయం లెగ్గానే దణ్ణం పెట్టుకోవాల్సిన మనిషిరాబాబూ ఆయన."

పొలం మీదున్న అప్పుకీ డాక్టరుగారి హస్తవాసికీ సంబంధం ఏవిటో అర్థవ కాలేదు అంజిరెడ్డికి. ఆ విషయం స్పష్టంగా తెలిసిన బొల్లి రాజుగారు అరగంట మాట్లాడేరు. ప్రతి అయిదారు వాక్యాలకీ ఉప్పురావు సహకార వాక్యాలు పలికేడు.

"బలేటోరే. తండ్రిలాగ మీరు చెప్పిం తరవాత ఊ అనకేవంటాడు? రేప్పొద్దున కొడుక్కి సెంటు బూవేనా ఇచ్చుకోవాలా?"

బొల్లిరాజుగారే మళ్లీ అన్నారు.

" నే చెప్పేనని కాదబ్బాయ్. ఆలోచించుకో. ఇదయితే ఒకళ్లకి ఉపకారం చేసినట్టా ఉంటది. నీ అప్పూతీరిపోద్ది."

కృష్ణం రాజుగారు అంజిరెడ్డిని తనుకూచున్న కుర్చీ దగ్గిరికి రమ్మన్నారు. కాయితం మీద పెన్సిలుతో బొమ్మలు గీసి చూపించేరాయన. అంజిరెడ్డి నోరు తెరుచుకుని వింటూ ఉండిపోయాడు. డాక్టుగారు నిజంగా క్రిష్ణపరమాత్ముడేనని అనుకున్నాడు రెడ్డి. మళ్లీ వెళ్లి గోడకి చేర్లబడ్డాడు అంజిరెడ్డి. అతని మాటకోసం ఎదురు చూస్తున్నారు రాజుగారు. ఉప్పురావు అన్నాడు.

"మాకు శలవిప్పించండి. మేం మాటాడుకుంటాం లెండి. మీకు కబురు నేనే చెప్తాను."

అంజిరెడ్డి ఊపిరి బొడ్డుకీ గుండెకాయకీ మధ్య ఎందుకో ఆరాటపడుతోంది. అతని

కళ్లు చెమర్చేయి. నుంచుని తువాల్తో కళ్లు ఒత్తుకుంటూండగా డాక్టరుగారు ఆప్యాయంగా అతని భుజం మీద చెయ్యివేసి అనునయంగా నవ్వేరు. అతనితో గుమ్మం వరకూ నడిచేరు. ఎండలోకి రాగానే ఉప్పురావు అన్నాడు.

"ఎక్కడా ఒక్క మాటపోక్కనీకు. అర్ధమైందా. రైతన్నవోడికి పొలం బోయిం తరవాత బతుకేవుంది.?"

అర్ధమైందన్నాడు రెడ్డి. మళ్లీ రామాలయంవేపు వెళ్లేడు. గుడి బయటనుంచుని దేవుడికి దణ్ణం పెట్టుకున్నాడు. మధ్యాహ్నం దాటిం తరవాత ఇంటికి తిరిగొచ్చి తిన్నగా మంచం మీద పడకేశాడు.

"అన్నందినూ? ఇప్పుడు పడకేటి ఎప్పుడూలేంది?"

" ఒద్దుగానీ............ఓ నాల్రోజుల్లో అయిదరాబాదెల్లాలి. బొల్లిరాజుగారు పన్జెప్పేరులే. మనగ్గూడా మంచిదే. ఊరంతా టమగ్గాని ఏసేపు గనక. ఎవరికీ తెలీడానికీల్లేదు. ఎల్లి నువ్వుతిను."

తరువాత రెండు రోజుల్లో ఆదెమ్మ అనేక ఆత్మహత్యా ప్రయత్నాలు వివరించిందతనికి. కిరసనాయిల పోసుకోడం, పురుగు మందుతాగడం, ఉరేసుకోడం లాంటివి.

"నోరుముయ్యోహె." అన్నాడు చిన అంజిరెడ్డి. మూడోరోజునుంచీ ఆదెమ్మ ఏడవడం మానేసింది. కడుపులో బెంగతీరడం లేదు. వారం రోజుల్లోగా వచ్చేస్తానని దేవుడి మీద, దేవతలమీద, తన పుస్తెలమీద ప్రమాణం చేయించుకుంది. ఉప్పురావు రోజు ఒకసారేనా అనుకోకుండా అంజిరెడ్డిని ఊళ్లో కలుస్తున్నాడు. బీడిలు అతనేకొంటున్నాడు. టీలు అతనివే. నాలుగు రోజుల తరవాత ఓ రోజు సాయంకాలం రామాలయం అరుగుమీద కుర్రాళ్లు పులీమేకా ఆడుతుంటే చూస్తూ నుంచున్నాడు అంజిరెడ్డి. వెనక నుంచి భుజం తట్టేడు ఉప్పురావు.

" ఓ పాలిరా."

ఇద్దరూ నడుచుకుంటూ రాజుగారింటికి వెళ్లేరు. లోపల లేతనీలం చొక్కాలో తెల్లగా ఆరోగ్యంగా కృష్ణంరాజుగారు ఆ వరుసలోనే నవ్వుతూ రెడ్డిని పలకరించి అతని భుజం మీద చెయ్యివేసి అన్నారు.

" రెడ్డిగారూ ఎలా ఉన్నారు?"

గ్లాసునిండా తియ్యటి టీ పట్టుకొచ్చి ఇచ్చేడు ఉప్పురావు.

"మన డాక్టర్గారు రెయిల్లో రిసర్వు చేయించారు. ఎల్లుండి ప్రయాణం. ఆ మధ్యాహ్నం

బస్సులో వీడూ నువ్వూ బయల్దేరుదురుగాని. రాజుగారింట్లో రాత్రి బువ్వతిని రైలెక్కండి. ఈడుంటాళ్లేనీతో." అన్నారు బొల్లిరాజుగారు.

" ఏటి, ఎల్లుండి పెట్టేరా?" అంటూ వేళ్లమీద లెక్కలేసి అన్నాడు ఉప్పురావు.

" అబ్బ, బ్రెమ్మాండమైన మూర్తం. మంచిరోజు పడింది."

మళ్లీ కాసేపు కృష్ణంరాజుగారు మాట్లాడేరు. ఉప్పురావూ అంజిరెడ్డీ బయటి కొచ్చిం తరవాత చేతిలో మూడొందలు పెడుతూ " నీగ్గాదులే. ఇంటో ఇచ్చి బయల్దేరు. కర్చులకి రాజుగారిచ్చేరని చెప్పు. అయిపోయింది. నీ దరిద్రం తీరిపోయిందనుకో" అన్నాడు. అంజిరెడ్డి బెంగలన్నీ చెప్పుకున్నాడు. ఉప్పురావు ధైర్యం చెప్పేడు. ఆరోజు ఆదెమ్మతో ఏవీ చెప్పలేదు.

ముందు రోజు రాత్రి నాలుగు లుంగీలు, రెండు చొక్కాలు, రెండుబనీన్లు తువాలు సంచిలో సద్దుకుని ఆదెమ్మని పిలిచి చెప్పేడు. ఆమెకి ఏడుపు ఆగలేదు. మళ్లీ అన్ని ప్రమాణాలూ చేయించుకుంది.

" నువ్వాబద్దం చెప్తే నువ్వొచ్చేసరికి నేనుండను."

" పనిమీదబడి ఎల్తన్నాను. అబద్దం ఎందుకు? సరేనా?"

అంజిరెడ్డికి భార్యని దగ్గిరికి తీసుకుని బెంగపడాలని ఉంది. ఆమె వేపు చూస్తూ చటుక్కున ఆదెమ్మని దగ్గిరికి తీసుకున్నాడు. ఆదెమ్మకి ప్రాణం హాయనిపించింది. ఒళ్లు కొంచెం ఏదోలా ఉంది. ఇద్దరి మధ్య కరువొచ్చిపడి చాలాకాలమైంది.

మర్నాడు మధ్యాహ్నం బస్సు లేపిన ధూళిలో కళ్లొత్తుకుంటూ నుంచుండిపోయింది ఆదెమ్మ. రాజమండ్రీలో దిగ్గానే కూల్‌డ్రింకు ఇప్పించేడు ఉప్పురావు. కడుపు కాస్త చల్లబడింది. బస్సెక్కే ముందు కష్టపడి ఆదెమ్మవేపు చూసి నవ్వేడు అంజిరెడ్డి. ఆటోలో రాజుగారి ఆస్పత్రికి వెళ్లేరిద్దరూ.

"ఇవాళ పేషెంట్లు ఎక్కువై పోయారు. రండి రెడ్డిగారూ." డాక్టరుగారు ఇద్దర్నీ మేడమీదికి తీసికెళ్లేరు. పరిశుభ్రంగా ఉందిగది. అతన్ని కూచోపెట్టి ఇద్దరూ కిందికి వెళ్లేరు. అయిదు నిముషాల తరవాత నర్సూ, టీ, ఉప్పురావు ఒచ్చేసరికి అంజిరెడ్డి ఒళ్లు జలదరించింది. గదంతా చల్లబడిపోయింది.

" ఏసీకి చలేసేస్తోందిరా బాబూ."

రాత్రి ఇద్దరూ పిలుపురాగానే కిందికి వెళ్లేరు. హాల్లో ఇంకా ఇద్దరు ముగ్గురు పేషెంట్లున్నారు. లోపలిగదిలో కూచోగానే ఎవరో రెండు కంచాలనిండా కోడిపులావు

తీసుకొచ్చి పెట్టేరు. భోజనం చేసేవరకూ ఎవరూ మాట్లాడలేదు. తరవాత డాక్టరుగారి చల్లటి కారులో స్టేషనుకి వెళ్లిపోయారు.

ఉదయం హాస్పిటలు లిఫ్టుదిగి నాలుగో అంతస్తులో అడుగుపెడుతూనే ఆశ్చర్య పోయాడు అంజిరెడ్డి. నీలం రంగుబట్టలో నర్సులందరూ అందంగా ఉన్నారు. డాక్టరుగారు రెండో అంతస్తులో ఆగిపోయేరు. రాత్రి రెడ్డికి భోజనం పెట్టలేదు. గ్లాసెడు పాలు తాగేడు. ఏసి గదిలో మంచి నిద్ర పట్టి, ఊరంతా వర్షంలో మునిగిపోయినట్టు కలగన్నాడు.

మర్నాడుదయం పదకొండు గంటలకి మత్తుమందు ఇచ్చేరు.

సాయంకాలం గానీ తెలివిరాలేదు రెడ్డికి.

ఉప్పురావు, డాక్టరుగారూ ఏదో అడుగుతున్నారు.

మర్నాడుదయం పూర్తిగా తెలివొచ్చి అడిగేడు.

" ఏటైంది?"

" నీకు జెప్పిందే? నీ అప్పువడ్డీతో సహ తీరిపోయింది. దస్తావేజు లిక్కడేనా దగ్గిరే ఉన్నాయి. ఊ? నీకేం బాధ లేదుగా?"

" అప్పుతీరడం నిజవే?"

"కాయితాలు చూపింతాను చూడు. నీ కెలా ఉందేటీ?"

"బాగానే ఉంది. ఈ కట్టిప్పేస్తారా?"

" తీస్తారు. తరవాత నెప్పి దప్పి ఉండదు. నీ పన్లు నువ్వు చేసుకోడవే ఏవీ తేడా ఉండదు. నువ్వు మూడోవాడివి నేజూసినాళ్లలో."

" పెండికాయ తీసేసారా?"

" పెండికాయ కాదు. మూత్రపిండం. డాట్రుగారు చూపించేరు. ఎర్రగా మన పెద్ద జీడిపిక్కలా ఉందనుకో. ఇంకోటుందిలే నీకు.... దేవుడు తెలివితేటల్లేని నా కొడుకనుకునే వాణ్ని. చూసేవా, కొన్ని రెండెట్టేడు. కొన్ని ఒకటే పెట్టేడు. ఏటి, ఉచ్చోసుకోడానికి ఓటి చాల్దేటీ?"

❖ ❖ ❖